క్లుప్తంగా

తహసీల్దార్ కార్యాలయానికి వరండా ఏర్పాటు

పామర్రు: తహసీల్దార్ కార్యాలయం వరండా ఏడాది క్రితం కూలి పోయింది. దీంతో కార్యాలయానికి వచ్చే వారికి నీడ లేకుండా పోయింది. ప్రస్తుతం వేసవి దృష్ట్యా నిలువ నీడ లేక సమస్యల పరిష్కారం కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్పందించిన తహసీల్దార్ శ్రీ పల్లవి వరండా ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. నూతనంగా వరండాను ఏర్పాటు చేసి వచ్చే వారికి నీడను కల్పించారు.

ఘనంగా విద్యావికాస్ స్నాతకోత్సవం



గుడివాడ టౌన్: స్థానిక విద్యావికాస్ బ్లూమ్స్ యూకేజీ విద్యార్థులు ప్రైమరీ తరగతుల స్నాతకోత్సవం గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. డైరెక్టర్లు ముప్పాళ్ల సుబ్బారావు, కొమ్మినేని సాంబశివరావు ఆధ్వర్యంలో చిన్నారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపాల్ పి.ఆశీర్వాదం, బ్లూమూన్స్ ఇన్‌చార్జి ఉమాదేవి పాల్గొన్నారు.

వీణ విజయరామరాజుకు ఘన నివాళి



గుడివాడ టౌన్: మాజీ ఎమ్మెల్సీ, ఉపాధ్యాయ సంఘాల నేత, ఎస్టీయూ మార్గదర్శి వీణ విజయరామరాజు వర్ధంతి సందర్భంగా స్థానిక ఏలూరు రోడ్‌లోని ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో నాయకులు ఆయన చిత్రపటానికి శుక్రవారం నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.చంద్రశేఖరరావు, రాష్ట్ర కౌన్సిలర్లు టీఎస్. రాజశేఖర్, ఏఎస్‌వీ ప్రసాదు, జిల్లా కార్యదర్శి పీవీఎస్‌డీ ప్రసాదు, పూజేశ్వరరావు, కేవీ సత్యనారాయణ పాల్గొన్నారు. .

అల్లా దీవెనలు అందరిపై ప్రసరించాలి



కైకలూరు: అల్లా దీవెనలు నియోజకవర్గ ప్రజలందరిపై ప్రసరించాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా కైకలూరు చిన్న మసీదు వద్ద శుక్రవారం జరిగిన ప్రత్యేక ప్రార్థన కార్యక్రమంలో జమాత్‌లను కలిసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఎంపీపీ అడవి కృష్ణ, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర, జిల్లా ముస్లిం మైనార్టీ నాయకులు అబ్దుల్ హమీద్, షేక్ రఫీ, నాయకులు మహమ్మద్ గాలబ్‌బాబు, అబ్దుల్ మాలిక్, అసాని ఖాన్, ఫిర్దోజ్ ఖాన్, మొహమ్మద్ అక్రమ్, షేక్ షాబుద్దీన్, షేక్ రెహ్మాన్, మున్నా, మత పెద్దలు, మత గురువులు పాల్గొన్నారు.

శాంతి స్వరూప్ మృతి విచారకరం

గుడివాడ టౌన్: న్యూస్ రీడర్ శాంతి స్వరూప్ మృతి చెందడం టీవీ వీక్షకులకు బాధాకరమని కవి వసుధ బసవేశ్వరరావు అన్నారు. శాంతి స్వరూప్ మృతిపై ఆయన శుక్రవారం సంతాపం తెలిపారు. హైదరాబాద్ దూరదర్శన్‌కు తొలి న్యూస్ రీడర్‌గా శాంతి స్వరూప్ ఎంతో పేరు ప్రఖ్యాతులు, ప్రతిష్టలు పొందారన్నారు. తాను కైకలూరు కమ్యూనికేషన్స్‌లో న్యూస్ రీడర్‌గా పనిచేస్తున్న సమయంలో శాంతి స్వరూప్ తనకు ఆదర్శమని పేర్కొన్నారు. ఆయన బాటలోనే తాను వార్తలు చదివేవాడినని, వ్యక్తిగతంగా ఆయన మృతి తనకు తీరని లోటని అని తెలిపారు.

నేటి నుంచి అమ్మవారి జాతర

కోడూరు: స్థానిక గంగాభవానీ అమ్మవారి ప్రధాన జాతరోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. మొదటి రోజు కోడూరు పోలీసులు అమ్మవారిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి తొలిపూజ చేసేందుకు స్టేషన్‌ను ముస్తాబు చేశారు. స్టేషన్‌లో పూజల అనంతరం అమ్మవారి గ్రామోత్సవాన్ని ప్రారంభించనున్నారు.

పోలీస్‌స్టేషన్‌లో తొలిపూజలు

జాతర ప్రారంభం రోజున అమ్మవారిని తప్పనిసరిగా పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి తొలిపూజలు చేయాలని అప్పట్లో తీర్మానించారు. ఎస్‌ఐ ఏవీఎస్ రెడ్డి చేసిన తీర్మానానికి గ్రామస్తులు కూడా అంగీకరించడంతో అప్పటి నుంచి నేటి వరకు అమ్మవారికి కోడూరు పోలీస్‌స్టేషన్ ఆఫీసర్‌గా ఉండే అధికారి తొలిపూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. శనివారం ఉదయం చిన్న అమ్మవారిని పోలీసు లాంచనాలతో స్టేషన్‌కు తీసుకువెళ్లనున్నారు. అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ నేతృత్వంలో నియోజకవర్గానికి చెందిన పోలీసులు అమ్మవారిని డప్పు వాయిద్యాల, నడుమ ఊరేగింపుగా స్టేషన్‌కు వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.

జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివి

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



జమీగొల్వేపల్లిలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్, నాయకులు

పామర్రు: అట్టడుగు వర్గాల అభ్యున్నతికి అణగారిన ప్రజలకు సమాన హక్కుల కోసం మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ చేసిన పోరాటం మర్చిపోలేనిదని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బాబూ జగజ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి, చాట్లవానిపురంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి, అడ్డాడ, పెదమద్దాలి, బల్లిపర్రు, జమీగొల్వేపల్లి, కొమరవోలు గ్రామాల్లోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి శుక్రవారం ఎమ్మెల్యే పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమానత్వం, అంటరానితనం నిషేధం, జమీందారీ వ్యవస్థ రద్దు తదితర విషయాలను స్వాతంత్ర్యానికి ముందే ప్రజలకు పరిచయం చేసిన సమతావాది జగ్జీవన్‌రామ్ అన్నారు. ఉప ప్రధానిగా దేశ సేవకు అంకితమైన ఆయన జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యురాలు స్వరూపరాణి, వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ల రమాదేవి, ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాసరావు, రత్నకుమారి, బేబి శాలిని, వెంకటేశ్వరమ్మ, ఆర్బీకే మండల అధ్యక్షుడు ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ ముప్పిడి సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

–జమీగొల్వేపల్లిలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ నాయకులు వల్లభనేని బుల్లిబాబు ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: మాజీ ఉపప్రధాని జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ జి. బాలసుబ్రహ్మణ్యం, ఉద్యోగులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. మేనేజర్ శ్రీనివాసులు, ఆర్ఓ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో..

స్థానిక ఏలూరు రోడ్‌లోని వైఎస్సార్ సీపీ ఎన్నికల కార్యాలయంలో పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు జరిపారు. ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి మామిళ్ల ఎలీషా, రూరల్ మండల అధ్యక్షుడు మట్టా జాన్ విక్టర్, వెంపటి సైమన్, విశ్రాంత పోలీస్ అధికారి వెంకట్రావు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ జోగా సూర్యప్రకాశరావు, నయనవరపు శేషుబాబు పాల్గొన్నారు.

– స్థానిక గుడ్‌మెన్ పేటలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ నాయకులు కంచెర్ల సుధాకర్, దళిత నాయకులు పొంగులేటి జయరాజు, అత్తాటి సాల్మన్, గంధం సైమన్‌బాబు, వేల్పుల నాగబాబు, తాళ్ళూరి ప్రశాంత్, బాలసాని కోటయ్య, అద్దంకి మాణిక్యాలరావు, మద్దాలి ఇస్సాకు, పి.వంశీ, సీహెచ్ సంసోన్, కొడాలి బాబు తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు.

మహనీయుడు జగ్జీవన్‌రామ్

గుడివాడరూరల్: అట్టడుగు వర్గాల అభ్యున్నతికి పోరాటాలు చేసిన మహనీయుడు మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ అని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్ పేర్కొన్నారు. మండలంలోని చిరిచింతలలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించారు. సర్పంచ్ తోట వీరరాఘవయ్య, ఎంపీటీసీ సభ్యుడు సుబ్బారావు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ సుందరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: మండలంలోని పలు గ్రామాల్లో మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. తోట్లవల్లూరు, గరికపర్రు, కుమ్మమూరు, పెనమకూరు గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు పెనుమత్స రాధిక, బొమ్మారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, నందేటి గంగాభవాని, వైస్ ఎంపీపీ కళ్లం శివారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మధుబాబు పాల్గొన్నారు.

పెదపారుపూడిలో..

పెదపారుపూడి: మండలంలోని పలు గ్రామాల్లో మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి తహసీల్దార్ వెంకట మాధవరావు పూలమాల వేసి నివాళులర్పించారు. వెంట్రప్రగడ పంచాయతీ వద్ద పంచాయతీ కార్యదర్శి సగ్గురి నరేష్, వీఆర్వో చాట్ల అజయ్‌కుమార్ బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: జగ్జీవన్‌రామ్ జయంతి మండలంలోని పమిడిముక్కల, కృష్ణాపురం, చోరగుడి, మామిళ్లపల్లి గ్రామాల్లో శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ నాయకులతో కలిసి ఆయా గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ కాసాని వేద సుప్రజ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యలమంచిలి గణేష్, వైస్ ఎంపీపీలు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య, ఎంపీటీసీ సభ్యులు గుర్విందపల్లి వంశీ, మత్రి దుర్గారావు, సర్పంచ్ ఆముదాలపల్లి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: అణగారిన వర్గాల హక్కుల కోసం కృషి చేసిన మహోన్నతుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని స్థానిక అంబేడ్కర్ అసోసియేషన్ గౌవా అధ్యక్షుడు ఎల్ఎస్.భాస్కరరావు, కె.శాంతరాజు అన్నారు. మండవల్లి అంబేడ్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక సెంటర్‌లో జగ్జీవన్‌రామ్ జయంతి జరిగింది. కార్యక్రమంలో చాబత్తిన విజయ్, గోరింక గాంధీ, బేతపూడి తంబిదాస్, దాకరపు వినోద్‌కుమార్, ఒట్టిప్రోలు సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో

ముదినేపల్లి రూరల్: బాబు జగ్జీవన్ రామ్ దళితుల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేశారని వైఎస్సార్ సీపీ నాయకుడు నిమ్మగడ్డ భిక్షాలు అన్నారు. మండలంలోని చేవూరులో జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద జయంతి కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. వైస్ ఎంపీపీ చొప్పర్ల సునీత, నాయకులు గొరుముచ్చు సామియేలు, ఇశ్రాయేలు పాల్గొన్నారు. ముదినేపల్లి దళిత సంఘాల కార్యాలయంలో మాల మహానాడు, అనుబంధ సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు సేవా నాగ జగన్ బాబురావు, మాదిగ దండోరా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసుపోగు దానియేలు ఆధ్వర్యంలో జగ్జీవనరామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

మొవ్వలో..

మొవ్వ: డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని మొవ్వ మండలంలో వాడవాడలా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మొవ్వ, చినముత్తేవి గ్రామాల్లో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ పూల మాల లేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ కొండేటి ఇందిరతో పాటు నాయకులు పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: మండలంలోని చింతపాడు, దెయ్యంపాడు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా చింతపాడులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఎల్ఏ దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) తనయుడు దూలం వీర ఆదివినయ్‌కుమార్ శుక్రవారం పాల్గొన్నారు. వైఎస్సార్ సేవాదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు, ఘంటసాల మహావిష్ణు, ముంగర కొండలు, వినోద్, దమ్ముపాటి దావీదు, కొత్తపల్లి బాలరాజు, మోరు రాజు తదితరులు పాల్గొన్నారు.



గుడివాడ మండలం చిరిచింతలలో నివాళులర్పిస్తున్న జాన్‌విక్టర్, నాయకులు



తోట్లవల్లూరులో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్



గుడివాడలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ తదితరులు

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



కైకలూరు: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. ఆచవరంలో శ్రీ కోదండ రామాలయం ప్రతిష్ఠ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శుక్రవారం పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద అతి పెద్ద అనివేటి మండపాన్ని నిర్మించామన్నారు. కలిదిండి పాతాళ భోగేశ్వరస్వామి దేవాలయం వద్ద గాలిగోపురాన్ని నిర్మిస్తున్నామన్నారు. ఆలయాల నిర్మాణాలకు దేవదాయ శాఖ ప్రాధాన్యం కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డీఎన్నార్ కుమారుడు దూలం వీర శ్యామ్ ఫణికుమార్, ఎంపీపీ అడవి కృష్ణ, ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర రాజు, నాయకులు బొమ్మనబోయిన గోకర్ణ యాదవ్, ఉప్పలపాటి జయదేవ్, బుర్ల నాగరాజు నిమ్మగడ్డ నారాయణ, బుర్ల భోగేశ్వరరావు పాల్గొన్నారు

పింఛన్ల పంపిణీ 88 శాతం పూర్తి



పామర్రు: మండలంలో ఇప్పటి వరకు 88 శాతం పింఛన్ల పంపిణీ పూర్తిచేసినట్లు ఎంపీడీఓ భారతి తెలిపారు. సచివాలయాల వద్ద జరుగుతున్న పింఛన్ల పంపిణీని శుక్రవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. మండలంలోని 17 సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా పింఛన్ల నగదు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులు సచివాలయాల వద్ద వేసవి ఉష్ణోగ్రతల దృష్ట్యా ఇబ్బందులు ఎదురు కాకుండా చూడాలన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు అవసరమైన తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు, షామియానాలు, కుర్చీలు ఏర్పాటు చేశామని తెలిపారు.

ప్రజా ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాలి

ఎమ్మెల్యే డీఎన్నార్



కలిదిండిలో బాబు జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కలిదిండి: ప్రజా ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) కోరారు. కలిదిండి 13వ వార్డులో గుడ్ మార్నింగ్ కలిదిండి కార్యక్రమం శుక్రవారం జరిగింది. పెద్ద ఎత్తున ప్రజలు ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతూ వారికి చేసిన సేవలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడారు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. అనంతరం జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, సర్పంచ్ మసీముక్కు మారుతి ప్రసన్న, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు సత్యవతి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తిరుమాని రమేష్, ఎంపీటీసీ సభ్యుడు సుమన్ పాల్గొన్నారు.

ఐకమత్యంతో పోరాడదాం



ముదినేపల్లి రూరల్: జరగబోయే ఎన్నికల్లో పెత్తందారులను ఐకమత్యంతో ఎదుర్కొందామని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) కోడలు దూలం స్వాతి, ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ అన్నారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మండలంలోని ములకలపల్లిలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా పోటీచేస్తున్న దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), కారుమూరి సునీల్‌కుమార్‌యాదవ్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీలు చొప్పర్ల సునీత, రాచూరి రాధ, సర్పంచ్ నువ్వుల కోటేశ్వరరావు, నాయకులు మోత్రు ఏసుబాబు, కోమటి విష్ణువర్ధన్, పేర్ని పృథ్వీ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం జగనన్నతోనే సాధ్యం

కలిదిండి: అన్ని వర్గాల సంక్షేమం, అభివద్ధి జగనన్నతోనే సాధ్యమని ఎమ్మెల్యే డీఎన్నార్ పెద్ద కోడలు శ్రీ అనుపమ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పెద తాడినాడలో నాయకులతో కలిసి శుక్రవారం ఇంటింట ప్రచారాన్ని నిర్వహించారు.

జగన్ పాలనలో అన్నింటా అభివృద్ధి

ఎమ్మెల్యే డీఎన్నార్, ఎంపీ అభ్యర్థి కారుమూరి



కై కలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్నింటా అభివృద్ధి సాధించామని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వింజరం, ఆచవరం గ్రామాల్లో ప్రజా ఆశీర్వాదయాత్ర పేరుతో శుక్రవారం ప్రచారం చేశారు. నాయకులు, యువకులు భారీ బైక్ ర్యాలీ చేశారు. ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి ప్రతి రోజూ ప్రజలతోనే మమేకమయ్యానన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాని కోరారు. ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో పార్టీ విజయం సాధిస్తోందనడానికి ప్రజల నుంచి వస్తున్న అపూర్వ స్పందనే నిదర్శనమన్నారు. ఎంపీపీ అడవి కృష్ణ, ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీరరాజు, జిల్లా వైఎస్సార్‌సీపీ సేవాదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు భట్రాజు శివాజీ, వైఎస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, సర్పంచ్ ధర్మరాజుల నాగమణి, సర్పంచుల సంఘ మండలాధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు పాల్గొన్నారు.

ముమ్మరంగా కొడాలి నాని ఎన్నికల ప్రచారం



అనుచరులతో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని



జగ్జీవన్ రామ్‌కు నివాళులర్పిస్తున్న కొడాలి నాని



ఎమ్మెల్యే కొడాలి నానికి హారతి ఇస్తున్న మహిళ

గుడివాడ టౌన్: గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) గెలుపే ధ్యేయంగా ఎన్నికల ప్రచారం ముమ్మరం చేశారు. స్థానిక 28వ వార్డు బేతవోలు పెదపేటలో ఆయన శుక్రవారం గడప గడపకు తిరుగుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకే వేసి తనను, ఎంపీ అభ్యర్థి డాక్టర్ చంద్రశేఖరరావును గెలిపించాలని కోరారు. మున్సిపల్ మాజీ కౌన్సిలర్ బూసి ప్రకాష్ ఆధ్వర్యంలో తొలుత స్థానిక విజయవాడ రోడ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గడప గడపకు తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. చిరు వ్యాపారులను పలకరిస్తూ వ్యాపార అభివృద్ధికి జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రోత్సాహాన్ని అడిగి తెలుసుకున్నారు. పుచ్చకాయల వ్యాపారి వద్దకు వెళ్లి పుచ్చకాయ కోసి అభిమానులకు పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో మహిళలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. కూరగాయల వ్యాపారి వద్దకు వెళ్లి వారితో ముచ్చటించి వారి చిన్నారులను ఎత్తుకుని ముద్దాడారు. వార్డు ఇన్‌చార్జి బూసి ప్రకాష్ ఇంటివద్ద జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. దేశ ఉప ప్రధానిగా, కేంద్ర హోం మంత్రిగా జగ్జీవన్ రామ్ దేశానికి ఎన్నో సేవలు చేశారన్నారు. అనంతరం బేతవోలులోని ఓ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ విజయ్ కుమార్ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా కొడాలి నానీ విజయం సాధించాలని, ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి రావాలని ఆయన ప్రార్థించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో స్థానిక నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, అన్ని విభాగాల అధ్యక్ష కార్యదర్శులు, మహిళా కార్యకర్తలు, యువజన విభాగం నాయకులు పాల్గొన్నారు.

నీటిచౌర్యం నివారణకు పటిష్ట చర్యలు

ఈ నెల 9న కైకలూరుకు గుడ్లవల్లేరు నుంచి నీరు చేరే అవకాశం



వింజరంలో ఉపాధి హామీ పనులతో కాలువకు మరమ్మతులు

కైకలూరు: కైకలూరు నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి నివారణకు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాలతో అధికారులు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. నియోజకవర్గానికి గుడ్లవల్లేరు లాకుల నుంచి పోల్‌రాజ్, క్యాంప్‌బెల్ కాల్వల ద్వారా శివారు గ్రామాలకు నీరు చేరుతోంది. నీటి కొరత కారణంగా రోజు విడిచి రోజు తాగునీటి సరఫరా చేస్తున్నారు. అనేక పంచాయతీ తాగునీటి చెరువుల్లో నీరు అడుగంటింది. ఈ నేపథ్యంలో ఏప్రిల్ మొదటి వారంలో ప్రకాశం బ్యారేజీ నుంచి నీటిని విడుదల చేస్తామని అధికారులు ముందుగానే ప్రకటించారు. నియోజకవర్గంలో 86 గ్రామాల్లో ఆక్వా సాగు జరుగుతోంది. మొత్తం నాలుగు మండలాల్లో 21,404.4 ఎకరాల్లో పంట విస్తీర్ణం ఉంది. కైకలూరు మండలంలో కై కలూరు, నరసాయిపాలెం, తామరకొల్లు, వేమవరప్పాడు, వింజరం, రాచపట్నం చానల్స్ ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. కైకలూరు చానల్ దిగువ గ్రామలైన ఆలపాడు, పల్లెవాడ, భుజబలపట్నం, చటాకాయి, నత్తగుళ్లపాడు, ఆటపాక, కైకలూరు, ఆచవరం గ్రామాలతో పాటు వరహాపటన్నం, శీతనపల్లి, దొడ్డిపట్ల, తామరకొల్లు గ్రామాల తాగునీటి చెరువులకు తక్షణం నీరు అవసరం.

తాగునీరు తరలిస్తే కఠిన చర్యలు

తక్షణ తాగునీటి అవసరాల కోసం కాల్వలకు ప్రకాశం బ్యారేజీ నుంచి నీటిని సరఫరా చేస్తున్నారు. కై కలూరు నియోజకవర్గానికి ఈ నెల 9న నీరు చేరనుంది. గతంలో తాగునీటిని చేపల, రొయ్యల రైతులు నీటి చౌర్యం చేయడంతో సమస్య ఉత్పన్నమైంది. ఆ పరిస్థితి రాకుండా మండల, గ్రామ స్థాయిలో వివిధ శాఖల అధికారులతో కమిటీలు ఏర్పాటు చేశారు. ఉదయం 7 నుంచి రాత్రి 12 గంటల వరకు కాల్వల వెంట గస్తీ నిర్వహించనున్నారు. నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో కలిపి 75,304.77 ఎకరాల్లో చేపల, రొయ్యల సాగు చేస్తున్నారు. ప్రధానంగా పంట కాల్వల వెంట రైతులకు నీటిని తరలించవద్దని ఫిషరీస్ శాఖ నోటీసులు జారీ చేసింది. ఇరిగేషన్ అధికారులు కాల్వలను జల్లెడ పట్టి అక్రమిత తూములును సిమెంటుతో పూడ్చి వేయించారు. నీటి తరలింపు మోటర్లు వినియోగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఉపాధి పనులతో మరమ్మతులు

కాలువలో పెరుకుపోయిన చెత్త, వ్యర్థాలను తొలగించేందుకు ఉపాధి పనులు చేపట్టారు. కైకలూరు మండలంలో ఆచవరం, రాచపట్నం, వింజరం, వదర్లపాడు, శీతనపల్లి, రామవరం, దొడ్డిపట్ల, గోనెపాడు, భుజబలపట్నం, పల్లెవాడ, ఆలపాడు గ్రామాల్లో ఉపాధి కూలీలతో పంట కాలువలకు మరమ్మతులు చేయించారు. పోల్‌రాజ్ కాల్వ, క్యాంబ్‌బెల్ కాల్వలకు గుడ్లవల్లేరు లాకుల నుంచి చెరో 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడానికి అధికారులు సన్నద్ధమయ్యారు. నీటి చౌర్యాన్ని నివారించి తాగునీటి చెరువులు నింపడానికి అధికారులు అన్ని చర్యలు తీసుకున్నారు.

భక్తిశ్రద్ధలతో మహా కుంభాభిషేకం

పెడన: పట్టణంలోని శ్రీవాసవి క్షేత్రంలో శ్రీవాసవి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ జరిగి 50 సంవత్సరాలైన (స్వర్ణోత్సవం) సందర్భాన్ని పురస్కరించుకొని పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవి క్షేత్రంలో తొలిసారిగా మహాకుంభాభిషేకం, విగ్రహాల పునః ప్రతిష్ఠ కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గత మూడు రెండు రోజులుగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. చివరి రోజు శుక్రవారం సామూహిక మహా కుంభాభిషేకం పూజా కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లూరి సత్యనారాయ (చిన్నా), మంజులత దంపతులు, పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి కొల్లూరి రాజా, పద్మ దంపతులు పెడన మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు జల్లూరి రామ్మోహన్‌రావు పార్వతీదేవి, కప్పలదొడ్డి ఆర్యవైశ్య ప్రముఖులు ఆలపాటి ఆనందవిఠల్, ధనలక్ష్మి, మండవల్లి అమ్మనేశ్వరరావు భవానీ దంపతులచే మహా కుంభాభిషేకం పూజా కార్యక్రమాన్ని స్వర్ణ శ్రీనివాస్ శర్మ, శ్రీవాసవి క్షేత్రం ప్రధాన అర్చకుడు స్వర్ణ సాయిబాబులతో పాటు 25 మంది ఋత్వికులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహింపజేశారు. భారీ అన్న సమారాధన చేశారు.